

చెన్నూరులో అత్యధిక వర్షపాతం నమోదు

ప్రజాశక్తి-కడప : చెన్నూరు మండలంలో అత్యధికంగా 55.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుండి బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేటలో 16.4, కమలాపురంలో 17.4, వల్లూరులో 23.8, ఒంటిమిట్టలో 1.6, సిద్ధవటంలో 14.6, కడపలో 28.2, చింతకొమ్మదిన్నెలో 8.4, పెండ్లిమర్రిలో 4.4, మైదుకూరులో 7.0, బి.మటంలో 18.0, కాశినాయనలో 2.2, బి.కోడూరులో 2.2, కొండాపురంలో 1.2, దువ్వూరులో 6.4, చాపాడులో 8.2, ప్రొద్దుటూరులో 4.6, జమ్మలమడుగులో 3.0, ముద్దనూరులో 11.2, ఎర్రగుంట్లలో 19.0, సింహాద్రిపురంలో 2.2, వేములలో 5.0, తొండూరులో 10.2, వి.ఎన్.పల్లిలో 2.4, వేంపల్లిలో 10.0, చక్రాయపేటలో 30.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సగటున 8.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత మార్గంలో పయనించాలి

- 'అనుకోని అతిథి' పుస్తకావిష్కరణలో వైవీయూ విసి

ప్రజాశక్తి-కడప అర్బన్

సమాజంలో జరుగుతున్న సంఘటనలను అర్థం చేసుకుని ఉన్నతమైన మార్గం వైపు పయనించే యువత ఎప్పుడూ విజయపథంలో పయనిస్తారని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. కథా రచయిత జ్యోతి జార్జి రచించిన 'అనుకోని అతిథి' పుస్తకాన్ని వైవీయూలో విసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థి లక్ష్యసాధనకు ప్రేమ వ్యవహారాలు అవరోధంగా నిలుస్తాయన్నారు. ఇందుకు ఎన్నో ఉదాహరణలు రచయిత జార్జి తన కథల్లో అక్షర రూపం ఇచ్చారన్నారు. అనుకోని అతిథి పుస్తకం యువతను చదివిస్తుందన్నారు. రిజిస్టర్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా యువత అడుగులు వేస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. కథల ద్వారా రచయితలో సమాజ పరిశీలన శక్తి కనిపిస్తుందన్నారు. పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జురెడ్డి మాట్లాడుతూ స్త్రీలను గౌరవిస్తే మనకు దేవతల వరాలు ఇస్తారని, హింసిస్తే భద్రకాళి అవుతారని తన 'ఎర్ర గులాబీ' కథ ద్వారా చెప్పడం అద్భుతంగా ఉందన్నారు. సినిమాల పిచ్చితో యువత తన ఉజ్వల భవిష్యత్తును బీటలువార్చుకునే తీరు' జీవితం మధుర స్వప్నం' అనే కథ ద్వారా అద్భుతంగా ఆవిష్కరించారన్నారు. కథలు చిన్నవైన పాఠకులను ఎంత వరకు చదివించగలిగేలా ఉన్నాయంటూ రచయితను అభినందించారు. పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని, సమకాలీన పరిస్థితులకు దర్పణంగా నిలిచేలా జార్జి కథలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో కవి, విశ్రాంత తెలుగు భాషోపాధ్యాయులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వర చారి, జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విసి సుధాకర్

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి నరసింహ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నీట్ పరీక్షను దేశవ్యాప్తంగా మరలా నిర్వహించాలని, పరీక్షలలో నెలకొన్న అవకతవకలపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలలో జరిగినటువంటి అవకత వకలపై అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి చేపట్టనున్న నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలపై విచారణ జరిపించాలన్నారు. నీట్ పరిక్షపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తగా, కేంద్రంలో మోడీ నేత ృత్వంలోని ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటానికే నిర్ణయించుకుందని విచారం వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా నీట్ స్కాంపై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయించినా పట్టించుకోని ప్రభుత్వం, చివరికి సుప్రీం కోర్టు కేంద్రానికి, నీట్‌ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)లకు నోటీసులు జారీ చేశాక ఎట్టకేలకు విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించారని తెలిపారు. ఎన్‌టిఎను మెరుగు పర్చాల్సి ఉందని చెప్పుకొచ్చారని, అంతేతప్ప కుంభకోణంపై విచారణ జరిపిస్తామనికాని, అభ్యర్థులకు ఏవిధమైన న్యాయం చేస్తామనికాని తెలపలేదన్నారు. నీట్‌లో అక్రమాలు అవేవో సాధారణంగా చోటు చేసుకున్న చిన్న తప్పులన్నట్లు పేర్కొన్నారు. తప్ప పశ్చాత్తాపం వ్యక్తీకరించలేదన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా జరిగే కార్యక్రమాలు జయప్రదం చేయడం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యావేత్తలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు రాధా వెంకట్ పాల్గొన్నారు.



యూనిఫాం నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఇఒ

యూనిఫాం నాణ్యతగా ఉండాలి

ప్రజాశక్తి-చెన్నూరు

మండలానికి సంబంధించి 2024-25 సంవత్సరానికి విద్యార్థుల యూనిఫాం నాణ్యతను మండల విద్యాధికారి-1 గంగిరెడ్డి, విద్యాధికారి-2 సునీత, బుధవారం సాయంత్రం పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని అన్ని పాఠశాలలకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు మండల కేంద్రానికి చేరాయని, వాటన్నిటిని కూడా నాణ్యతను పరిశీలించామని పేర్కొన్నారు. షూష్ అందలేదని త్వరలోనే పాఠశాల పునఃప్రారంభమైన తర్వాత విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. ఇవన్నీ కూడా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చేరవేస్తామన్నారు. కార్యక్రమంలో సిఎంఒ (కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్) కేశవరెడ్డి, అసిస్టెంట్ కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్ దశరధరామిరెడ్డి పాల్గొన్నారు.

అనర్హులకు భూమిని ఆన్‌లైన్ చేశారు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఖాజీపేట మండల తహశీల్దార్ అనర్హులకు భూమిని ఆన్‌లైన్ చేశారని బాధితుడు అంకిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పేరు మీద ఉన్న రెండు ఎకరాల భూమిని ఇతరులకు ఆన్‌లైన్ చేశారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

'రాచపూడి' కళాశాలను పరిశీలించిన ఎన్ఎఎసి కమిటీ

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని రాచపూటి నాగభూషణం డిగ్రీ అండ్ పీజీ కళాశాలను ఈనెల 17 నుండి 19 వరకు ఎన్ఎఎసి కమిటీ వారు పర్యవేక్షించారు. అనంతరం కమిటీ అధ్యక్షులు సంజీవ్ భనావత్ మాట్లాడుతూ కళాశాల చైర్మన్ సాయికృష్ణ బద్వేలు లాంటి వెనుకపడిన ప్రాంతంలో విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు సమగ్ర అభివృద్ధి కోసం చాలా కష్టపడుతున్నారని, విద్యార్థులు కళాశాలలో అన్ని సౌకర్యాలను వినియోగించుకొని అభివృద్ధిలోకి రావాలి అని కోరారు కోరారు. రెండు రోజులపాటు జరిగిన ఈ ఎన్ఎఎసి పర్యవేక్షణలో కమిటీ సభ్యులు జి.ఎస్.గిరీష్ కుమార్, రామపల్లబ్ రాయ్, ఎన్ఎఎసి కో-ఆర్డినేటర్ బి.అశోక్, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి- గోపవరం

ఖరీఫ్ సీజన్‌లో సంతృప్తికర వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండి సాంకేతిక సలహాలు అందించాలని వ్యవయాసాధికారి నాగరాజు అన్నారు. బుధవారం బద్వేల్ వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో మండల రైతు భరోసా కేంద్ర సహాయకులు, మండల వ్యవసాయ అధికారితో సమీక్షా సమావేశం నిర్వచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు విత్తనాలు పంపిణీ సజావుగా త్వరిత గతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. మొలక శాతం నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమగు రసాయనిక ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. సీజన్, క్రాప్ కండిషన్ రిపోర్ట్స్ వారానికి ఒక సారి తప్పని సరిగా సమర్పించాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో రైతుల అవసరాలను గుర్తించడం తోపాటు ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంభించే విధంగా రైతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిజిష్టర్ తప్పని సరిగా నిర్వహించాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో బిల్లులు తప్పనిసరిగా పొంది, లేబుల్స్, సంచి పంట కోత పూర్తి అయ్యే వరకు భద్ర పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బికె సహాయకులు విజయ్ కుమార్, ఓబయ్య, సతీష్, బాదుల్ల, సుబ్బయ్య, మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య, కార్యాలయ సిబ్బంది చంద్రకళ, గైబువల్లి పాల్గొన్నారు.

22న పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ నెల 22న విద్వాన్ కె.వి.రమణారెడ్డి రచించిన 'ప్రజ్ఞాన ప్రకాశిక' పుస్తకం ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తకావిష్కరణలో భాగంగా అదే రచయిత రాసిన 'గీర్వాణి తిలకం గీతాంజలి' పుస్తకం పరిచయం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా ఆచార్య జి.శివారెడ్డి పాల్గొంటారని, ఆచార్య మేడిపల్లి రవికుమార్ పుస్తక సమీక్ష చేస్తారని, గజ్జెల అశోక్ రెడ్డి పుస్తక పరిచయం నిర్వహిస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి అచార్య నల్లపరెడ్డి ఈశ్వరరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఆత్మీయ అతిథులుగా ఇంటాక్ కడప కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, సాహితీవేత్త డాక్టర్ ఐఎల్ఎన్ చంద్రశేఖరరావు, రచయిత కె.వి.రమణారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో(డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాలు, కడప జిల్లాలో) 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తులు సంబంధిత గురుకుల విద్యాలయాలలో సేకరించబడతాయని ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయకర్త ఎల్.మాధవి లత తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 27న స్కూల్ పరిధిలో జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఏ స్కూలును అయితే కోరుకుంటారో ఆ స్కూలుకు వెళ్లి దరఖాస్తు చేసుకొని ప్రవేశ పరీక్షకు హాజరు అవ్వాలని తెలిపారు.

అవగాహనతోనే సికిల్ సెల్ వ్యాధి నివారణ సాధ్యం

- డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

సికిల్ సెల్ అనీమియా నివారించాలంటే అవగాహనతోనే సాధ్యమవుతుందని డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు అన్నారు. పిఎం జన్మాన్-ప్రైమ్ మినిస్టర్ జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎర్రముక్కపల్లె అర్బన్ హెల్త్ సెంటర్‌లో సికిల్ సెల్ అనీమియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా దోమ ద్వారా కానీ, ఒకరి నుంచి ఒకరికి గానీ రాదని, ఇది జన్యు సంబంధ వ్యాధి అని, ఈ వ్యాధి చాలా కొద్ది మందిలో మాత్రమే వస్తుందని చెప్పారు. ఈ వ్యాధిగ్రస్తులలో ఎర్ర రక్త కణాలు కొడవలి రూపంలోమారి రక్త ప్రసరణ ద్వారా శరీర భాగాలలో ప్రవహించి మంచి రక్త కణాలకు అడ్డుపడి అనేక రకాల వ్యాధులకు గురి అవుతారని తెలిపారు. ఈ వ్యాధులను సకాలంలో రక్త పరీక్షల ద్వారా గుర్తించాలని, గుర్తించిన తర్వాత రక్తం ఎక్కించుట, బోన్ మారో చికిత్స, స్టెమ్ సెల్స్ చికిత్స ద్వారా మాత్రమే నివారించబడుతుందని పేర్కొన్నారు. ఈ చికిత్సకు ఎక్కువ ఖర్చు అవుతుంది కాబట్టి ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేస్తారని చెప్పారు. వ్యాధిగ్రస్తులకి నెలకు పదివేలు చొప్పున పెన్షన్ కూడా వస్తుందని తెలిపారు. ఈ వ్యాధిని 2047 నాటికి సమూలంగా నిర్మూలన చేయాలని మన భారత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని పేర్కొన్నారు. చికెన్ సెల్ అనిమియా వ్యాధి లక్షణాలైనా రక్త కణాలు తగ్గడం, కళ్ళు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తరచుగా వచ్చే అంటువ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయవ నష్టం జరుగుతుంది తెలిపారు. సికిల్ సెల్ అనీమియా గురించి ప్రతి గ్రామంలోనూ, హెల్త్ క్లినిక్ లోను, పిహెచ్‌సిలోనూ, అర్బన్ హెల్త్ సెంటర్స్ లోనూ అవగాహన కలిగించాలని చెప్పారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అధికారి సరస్వతి మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా ఎక్కువగా ట్రైబల్ ఏరియాలలో ఉన్నందువలన అక్కడ అందరికీ రక్త పరీక్షల ద్వారా కనుగొని తగిన చికిత్స చేయాలనేదే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, ఆరోగ్యశ్రీ డిసి డాక్టర్ బాలాంజనేయులు, ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేష్, డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ రియాజ్ అహ్మద్, డిస్టిక్ మలేరియా ఆఫీసర్ మనోరమ, డిప్యూటీ డెమో రమణమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి పద్మశ్రీ

- సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ

ప్రజాశక్తి -గోపవరం

లోక్‌అదాలతక్షలో కేసులను రాజీ చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు, జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు 29వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని బద్వేల్ కోర్టు పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లో డిఎస్‌పి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి, మాట్లాడుతూ కేసులలో ఉన్న వారికి లోక్ అదాలత్ పరిజ్ఞానాన్ని తెలిపి దానివల్ల ఇరువు పార్టీల కక్ష దారులకు ఎంత ఉపయోగము తెలిపి మరిన్ని కేసులను రాజీ చేయాలని తెలిపారు. ప్రతి కక్షిదారులు కేసులో రాజీపడి సంతోషకరమైన జీవితం జీవించే విధంగా చేయాలని కోరారు. సమావేశంలో ఎపిపి ఉమాదేవి, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సమస్యలుంటే డిఎల్ఎస్ఎను సంప్రదించండి

ప్రజాశక్తి-కడప: ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించవచ్చునని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం కడప నగరం రామాంజనేయపురంలోని చౌడమ్మ వృద్ధాశ్రమాన్ని జడ్జి సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011ను వివరించారు. సంరక్షణ, భద్రత కల్పించవలసిన వృద్ధులను విడిచిపెట్టిన, పరిత్యాగం చేసే విధంగా బుద్ధిపూర్వకంగా వ్యవహరించిన అట్టివారు శిక్షార్హులు. శిక్షాకాలం గరిష్టంగా మూడు నెలలు జైలు శిక్ష లేదా అపరాధ రుసుము గరిష్టంగా ఐదు వేల రూపాయలు లేదా రెండింటినీ కలిపి విధించ వచ్చును. అర్హులు తగిన సమాచారం కొరకు, సూచనలకు మరియు న్యాయ సేవలకై ప్రతి ఆర్‌డిఒ ఆఫీసులో సంప్రదించాలన్నారు. కడప జిల్లాలో మూడు ట్రిబ్యునల్స్ ఉన్నాయని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 14567, గౌరవ జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100 పై అవగాహన కలిగించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చన్నారు. కార్యక్రమంలో చౌడమ్మ వృద్ధాశ్రమం నిర్వాహకులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

ఇంధన పొదుపు... దేశ అభివృద్ధికి మలుపు : ఎంఇఒ

ప్రజాశక్తి-చెన్నూరు

ఆధునిక కాలంలో ఏ పని జరగాలన్న ఇంధన అవసరం తప్పనిసరని వాటిని పొదుపుగా వాడుకోవడం అభివృద్ధికి మూలమని మండల విద్యాశాఖ అధికారులు డి.గంగిరెడ్డి, సునీత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వారు సందర్శించి ఇంధన పొదుపు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనవసరంగా గృహంలో గానీ, కార్యాలయాలలో గానీ విద్యుత్తును దుర్వినియోగం పరచరాదన్నారు. ఇంటి కిటికీలు తెరవడం ద్వారా సహజంగా గాలి, వెలుతురు అందుతాయని అవి ఆరోగ్యానికి తోడ్పాడతాయన్నారు. అవసరం మేరకే విద్యుత్తును వాడడం చేయాలన్నారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులైన సోలార్ ఎనర్జీనీ ఎక్కువగా వాడుకోవాలని సూచించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ఉన్నత సమాజ స్థాపనకతే ధ్యేయం : జడ్జి

ప్రజాశక్తి-కడప సిటీ

ఉన్నత సమాజ స్థాపనకతే విద్యార్థి విజయ రహస్యం పుస్తకం ధ్యేయమని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జ్ బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో 'విద్యార్థి విజయ రహస్యం' అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ నేటి విద్యార్థులు రేపటి భావితర పౌరులుగా, సమాజ నిర్దేశకులుగా తీర్చిదిద్దడానికి విద్యార్థి విజయ రహస్యం అనే పుస్తకాన్ని రచించారన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం, జ్ఞానంతో పాటు లోకజ్ఞానం, ఆధ్యాత్మిక భక్తి భావాలు పెంచే దిశగా భగవద్గీత, భాగవతం లాంటి శ్లోకాలు, పద్యాలను క్రోడీకరించి సందర్భోచితంగా విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించే దిశగా ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను గౌరవించే దిశగా సమాజంలో ఉన్నత స్థానం చేరుకోవడానికి కావలసిన స్ఫూర్తిదాయకమైన కథలను జతచేస్తూ రచించారు. అటువంటి గొప్ప పుస్తకాన్ని ఈ సమాజానికి పరిచయం చేసిన ప్రభాకర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ విద్యాశాఖ అధికారి నాగమునిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బాల ఎల్లారెడ్డి, లాయర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను తరలించొద్దు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాలను అమరావతికి తరలించవద్దని రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రతినిధులు మహమూద్, వరలక్ష్మి, పద్మ తెలిపారు. బుధవారం స్థానిక హోమోస్పేటలోని సృజన సామాజిక వేదిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాయలసీమ ప్రాంతానికి అభివృద్ధిలో ప్రాధాన్యత ఇస్తారని సీమ ప్రజలంతా ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. అందువలే ఎన్‌డిఎ కూటమికి ఈ ఎన్నికల్లో రాయలసీమ నుండి అత్యధిక సీట్లు కట్టబెట్టారన్నారు. కానీ రాయలసీమ హక్కులను విస్మరిస్తూ కర్నూల్ నగరంలో ఏర్పాటు చేసిన మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్‌బోర్డు, ఎలక్ట్రిసిటీ అథారిటీ. కార్యాలయాలను అమరావతికి తరలించబోతున్నారనారు. ఇది సీమ ప్రజల ఆకాంక్షలపై పిడుగు పాటులాంటిదన్నారు. అభివృద్ధి అంటే ఒకే చోట అది అమరావతిలోనే కేంద్రీకరించడం కాదని కూటమి ప్రభుత్వం గుర్తు ఎరగాలన్నారు. అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ ఉత్తరాంధ్రకు ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రం అనంతపురంకు కేటాయించిన సంస్థలను గుంటూరుకు తరలించడం ఇక్కడి ప్రజానీకం ఇంకా మరణించి పోలేదన్నారు. అభివృద్ధి కేంద్రీకరణ ప్రాంతాల మధ్య విభేదాలకు దారితీస్తుందని తెలంగాణ అనుభవాలను మర్చిపోవద్దని మరోసారి కోరుతున్నామన్నారు. వెంటనే ప్రభుత్వ కార్యాలయం తరలింపు ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతున్నామన్నారు. రాయలసీమ ప్రజాప్రతినిధులు ఈ తరలింపును వ్యతిరేకంగా ప్రజల పక్షాన నోరు విప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాయలసీమ విద్యార్థి శక్తి కన్వీనర్ హరిత రాయలసీమ మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యా వంతుల వేదిక సభ్యులు

నిరాశ్రయులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న చెప్పలి పుల్లయ్య

ప్రజాశక్తి-కడప

కాంగ్రెస్ పార్టీ జాతీయ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య అధ్యక్షతన ఆదరణ నిరాశ్రయుల గృహంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మొదటగా కేక్ కటింగ్ చేశారు. ఈ సందరరేగా చెప్పలి పుల్లయ్య మాట్లాడుతూ దేశ ప్రజల ఆశాకిరణం రాహుల్ గాంధీ అన్నారు. ఎంతోమంది నిరాశ్రయులకు, వృద్ధులకు ఆసరాగా నిలిచిన ఆదరణ ట్రస్ట్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.భావి భారత ప్రధాని రాహుల్ గాంధీకి ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపున, కార్మిక విభాగం తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టాక్సీ యూనియన్ రాష్ట్ర కోఆర్డినేటర్ హబీబుల్లా, జిల్లా అధ్యక్షుడు శివ, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు, యువజన కాంగ్రెస్ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, మహిళా నాయకురాలు లావణ్య, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు శ్రీహరి, కార్మిక నాయకులు యశ్వంత్, మహబూబ్ బాషా, శీను, లక్ష్మీదేవి, పార్టీ నాయకులు, ఆదరణ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు

జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అఫ్జల్‌ఖాన్, రాష్ట్ర మైనార్టీ విభాగం ఉపాధ్యక్షులు మహమ్మద్ అలీఖాన్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధికి కృషి చేయడంలో రాహుల్‌గాంధీ దార్శనికత, అంకితభావం కీలకపాత్ర పోషించాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు ఆనంద్ కుమార్, సమాచార శాఖ హక్కు చట్టం జిల్లా అధ్యక్షులు మామిల్ల నరసింహులు, మహిళా నాయకురాలు గౌరీ, గంగయ్య పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు డాక్టర్ దీపిక బుధవారం సికిల్ సెల్ అనిమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి వంశ పార్యపరంగా వస్తుందన్నారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉండడం, అలసట, గర్భ దారణ సమయంలో సమస్యలు రావడం, శరీర అవయవాలకు నష్టం కలగడం వ్యాధి లక్షణాలన్నారు. సరైన కాలంలో వ్యాధి గుర్తించడం వల్ల నయం చేయ వచ్చన్నారు. సమతుల పౌష్టికాహారం, ప్రత్యేక టీకాలు వేయించు కోవడం, చికిత్స రోగ నిర్ధారణ అయినా వారికి హైడ్రోక్సీ యూరియా మాత్రలతోపాటు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తామన్నారు. అత్యవసరమైతే రక్తం ఎక్కించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎంఒ గురుకుమార్, సూపర్‌వైజర్ ఓబులేసు, రేణుక, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

చాపాడు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్న గురువలూరు హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్‌లో డాక్టర్ జి.రాజేష్ కుమార్, డాక్టర్ కావ్య మాధురి ఆధ్వర్యంలో గోడ పత్రికలు ఆవిష్కరించారు. సికిల్ సెల్ అనిమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, ఆశ నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్స్ సరస్వతి, బాబురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



టీం సభ్యులను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

నిర్వహణ, సేవలపై డాక్టర్ల పరిశీలన

ప్రజాశక్తి - చాపాడు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని చిన్న గురువలూరు విలేజ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ క్లినిక్, పరిసరాల శుభ్రతను జాతీయ క్వాలిటీ అస్సెస్‌మెంట్ టీమ్ డాక్టర్ ప్రేమాన్స్ పాండ్య, డాక్టర్ సిద్దార్థ్ శుక్ల బుధవారం పర్యవేక్షించారు. చాపాడు, నక్కలదిన్నె వైద్యులు రాజేష్‌కుమార్, కావ్య మాధురి ఆధ్వర్యంలో మాతాశిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో మెయిటైన్ చేయాలని, మందులు, సేవలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సరళాదేవి, జిల్లా కాన్సలిడెంట్, ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, పిహెచ్‌యన్ సుకన్య, సూపర్‌వైజర్స్ సరస్వతి, బాబురెడ్డి, సిహెచ్ఒ శివమ్మ, ఎఎన్ఎం రమీజా, యంఎల్‌హెచ్‌పిలు, ఆశాలు పాల్గొన్నారు.



కోలాటం వేస్తున్న మహిళలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని భద్రిపల్లె గ్రామంలో వెలసిన దిగంబర వీరయ్య స్వామి 47వ ఆరాధన మహోత్సవాన్ని బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. గురుపూజ పుష్పాలంకరణతో పూజా కార్యక్రమం ప్రారంభించారు. వివిధ గ్రామాల తాళాల భజన బృందాలచే 24 గంటలపాటు నిరంతరం కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నెర్రవాడ వారిచే కోలాటం, శ్రీ సాయి నాట్య కళా సమితి అద్దంకి వారిచే భక్త చింతామణి పూర్తి నాటకం, శివలీల వైభవం ప్రదర్శించారు. నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అభివృద్ధి కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, ఓబుల్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రికార్డులను పరిశీలిస్తున్న తహశీల్దార్ భీమేశ్వరరావు

భూ తగాదా పరిష్కారంకాక మహిళ ఆత్మహత్యాయత్నం

- పొలంలో విష ద్రావణం తాగిన కళావతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని జంగంరెడ్డిపల్లె గ్రామంలో కొన్నేళ్లుగా భూమి తగాదా పరిష్కారం కాకపోవడంతో మనస్థాపనతో బుధవారం ఓ మహిళ విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. జంగంరెడ్డిపల్లి గ్రామం సర్వేనెంబర్ 40లో కొన్నేళ్ల నుంచి క్రిష్టిపాటి కళావతి, క్రిష్టిపాటి నడిపి రోసిరెడ్డి మధ్య ఒక ఎకరాకు సంబంధించి తగాదా నడుస్తోంది. దీనిపై వారు కోర్టును కూడా ఆశ్రయించారు. అయితే క్రిష్టిపాటి నడిపి రోసిరెడ్డి బుధవారం జెసిబి సాయంతో పొలంలో పనులు చేస్తుండగా.. ఈ పొలం తమదని కళావతి అడ్డు పడింది. అయినా వినకుండా పనులు చేస్తుండగా కళావతి ఇంటికి వచ్చి చీనీ చెట్లకు వినియోగించే క్రిమి సంహారక మందును తోట వద్దకు తీసుకెళ్లి అక్కడే తాగింది. విషయం తెలుసుకున్న స్థానికులు 108సాయంతో ఆమెను పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం..

జంగంరెడ్డిపల్లి సర్వేనెంబర్ 40లో కలిగిన ఒక ఎకరా భూమికి సంబంధించి ఇరువురి మధ్య 20ఏళ్లుగా తగాదా నడుస్తుందని తహశీల్దార్ భీమేశ్వరరావు తెలిపారు. కళావతి విష ద్రావణం సేవించిన సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ వెంటనే గ్రామానికి వెళ్లి భూ సమస్య పట్ల ఇరువురిని విచారించి వారి వద్దఉన్న డాక్యుమెంట్లను పరిశీలించారు. పూర్తిస్థాయి నివేదికను పులివెందుల ఆర్‌డిఒకు అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ షేక్షావలి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గిన వేరుశనగ సాగు - ప్రత్యామ్నాయంపై మొగ్గు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



ఆరుగాలం కష్టించే రైతన్నలు వేరుశనగ సాగుకు స్వస్తి పలికి, ప్రత్యామ్నాయ పంటలతో కుస్తీ పడుతున్నారు. వేరుశనగ పంటకు విపరీతమైన ఖర్చు రావడం, దిగుబడి దశలో గిట్టుబాటు ధర ఉండకపోవడంతో ఆ పంట సాగుకు స్వస్తి పలికినట్లు రైతులు తెలి పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వివిధ రకాల పంటలపై దృష్టి సారిం చారు. ఖరీఫ్ సీజన్ రానే వచ్చింది. ప్రకృతి కూడా అనుకూలించింది. సకాలంలో వర్షం కురిసింది. ఇంకేముంది ఆశలు మదిలో నింపుకుని రైతన్నలు వేరుశనగ విత్తనం ప్రారంభించారు. ప్రస్తుతం వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గతంలో పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 70 నుంచి 80 శాతం వరకు వేరుశనగ సాగించేవారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తే కేవలం 15 నుంచి 20 శాతం మంది రైతులు మాత్రమే వేరుశనగ సాగు పట్ల మక్కువ చూపు తున్నట్లు తెలుస్తోంది. కాడెద్దులు కూడా దొరకని పరిస్థితి నేడు ఎదురైంది. గతంలో పశుగ్రాసం కోసం వేరుశనగ సాగు చేసే రైతులు నేడు ఆ పంటకు దూరం కావడం బాధాకరం. ఈ విధంగా వేరుశనగ సాగుకు ప్రత్యామ్నాయంగా పత్తి, ఉద్ది, కంది, పెసర, ఇనుము తది తర పంటల సాగుపై రైతులు దృష్టి సారించారు. కృష్ణా జలాలు అందు బాటులో ఉన్న కారణంగా ప్రతి రైతు నీటి వసతిపై ఆధారపడి వివిధ పంటలను సాగు చేస్తు న్నారు. ఈ నేపథ్యంలో కూడా సాగునీటి పైనే ఆధారపడి వేరుశనగ చేపట్టనున్నట్లు రైతులు వెల్లడించారు.

రాహుల్ నాయకత్వం దేశానికి అవసరం



ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న తులసిరెడ్డి, నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రస్తుత పరిస్థితుల్లో అటు దేశానికి ఇటు కాంగ్రెస్ పార్టీకి రాహుల్ గాంధీ నాయకత్వం ఎంతో అవసరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఎఐసిసి మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తులసిరెడ్డి కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో గాంధీ సిద్ధాంతానికి, గాడ్సే సిద్ధాంతానికి, ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య సైద్ధాంతిక పోరు నడుస్తున్నట్లు చెప్పారు. గాంధీ సిద్ధాంతానికి, లౌకిక వాదానికి, ప్రజాస్వామ్యానికి కాంగ్రెస్ ప్రతినిధిగా, గాడ్సే యిజానికి, నియంతృత్వానికి బిజెపి ప్రతినిధిగా ఉందన్నారు. ఇప్పటికే సిబిఐ, ఇడిఐటి, ఎన్నికల కమిషనర్‌తోపాటు రాజ్యాంగ వ్యవస్థలను బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఈ పోకడలను సకాలంలో ఎదుర్కొనకపోతే దేశంలో ప్రజాస్వామ్యం పోయి నియంతృత్వం వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ వంటి ప్రతిష్టాత్మకమైన పరీక్షల్లో అవినీతి, అక్రమాలు, అవకతవకలు విచ్చలవిడిగా జరిగాయని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థులు, యవత జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ఈ చారిత్రక నేపథ్యంలో దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు అయిన రాజీవ్ గాంధీ నాయకత్వం దేశానికి అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పూల నజీర్, జమ్మలమడుగు అసెంబ్లీ ఇన్‌ఛార్జి బ్రహ్మానందరెడ్డి, ప్రముఖ సంఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్, పుంగనూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జి సింగం రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, అమర్, రాజా, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, వినయ్, ఉత్తన్న, ఆరుశేర్ల సుబ్బరాయుడు, రఫీక్, రవి, బద్రి, మాస్లు, ప్రభుత్వ వైద్యుడు వైద్యనాథ్ పాల్గొన్నారు.

ఉద్యోగ కాలం ముగిసినా.. కొనసాగుతున్న యానిమేటర్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగుల విరమణ వయసును ప్రభుత్వం 60 నుంచి 62 ఏళ్లకు పెంచింది. 62 ఏళ్లు దాటిన ప్రతి ఉద్యోగి బాధ్యతల నుంచి విరమణ చేయక తప్పదు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొందరు ముద్దనూరు వెలుగు కార్యాలయం మహిళా మండలి గ్రామ సమాఖ్య యానిమేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. 62 ఏళ్లు పైబడిన వారు నలుగురు ఉన్నారు. వీరిలో టౌన్ నుంచి ఇద్దరు, రెండు గ్రామాలకు చెందిన యానిమేటర్లు మరో ఇద్దరు ఉన్నారు. మండల వ్యాప్తంగా 32 గ్రామ సమాఖ్యలకు గానూ 32 మంది ఆనిమేటర్లు ఉన్నారు. ఒక్కో ఆనిమేటర్ 30 డ్వాక్రా సంఘాలకు పలు సేవలు అందిస్తుంటాడు. ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం మహిళా సంఘాల ద్వారా అందిస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించి, వాటిని సంఘాలకు చేరువ చేసేందుకు సహకారం అందించడం వీరి విధి. యానిమేటర్లు సంఘాల బుక్కులు నిర్వహణ, సమావేశాలు నిర్వహించడం, బ్యాంకులో రుణాలు, పొదుపులు, అప్పులు, రుణాల రికవరీ, తోడ్పాటు అందించడం వంటి విధులు నిర్వహించాలి. 62 ఏళ్లు పైబడితే శరీరం సహకరించపోవడం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వారు విధులు నిర్వహిస్తున్న శాఖలో పొరపాట్లు చేసే అవకాశాలు ఉంటాయి. ఉద్యోగ విరమణ వయసు దాటిన వారు సక్రమంగా విధులు ఎలా నిర్వహించగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు. తప్పులు, పొరపాట్లు జరగకుండా ఉండేందుకు, ఉద్యోగులకు ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూసేందుకు ప్రభుత్వం విరమణ వయసు నిర్ణయించి విశ్రాంతి తీసుకోవాలని సూచిస్తోంది. జిల్లా అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు. దీనిపై వెలుగు ఇన్‌ఛార్జి ఎపిఎం ఇబ్రహీంను అడుగగా.. మండలంలో 32 మంది ఆనిమేటర్లు ఉన్నారు. వీరిలో విరమణ వయసు పైబడిన వారు నలుగురు ఉన్నారని తెలిపారు.

కూచిపూడిలో కార్తీక ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



నృత్య భంగిమలో కార్తీకరెడ్డి

కూచిపూడి నృత్యంలో ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన పాలగిరి కార్తికరెడ్డి ఉత్తమ ప్రతిభతో అందరినీ అలరిస్తోంది. హైదరాబాదులోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ఏర్పడి 10 సంవత్సరాలు కావడంతో 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాలగిరి రామిరెడ్డి, వందన కుమార్తె కార్తీకరెడ్డి కూచిపూడి నృత్యా న్ని అద్భుతంగా ప్రదర్శించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దైవజ్ఞ శర్మ, స్వర్ణ కంకణ గ్రహీత డాక్టర్ ఆమని, నటరాజ్ అకాడమీ అధ్యక్షులు కిషన్ పాల్గొన్నారు. కూచిపూడి నృత్యంతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్తికరెడ్డిని అతిథులు శాలువాలతో సత్కరించి షీల్డ్‌ను బహుమతిగా ప్రదానం చేశారు. కూతురు ప్రతిభకు రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరు ప్రఖ్యాతలు చూసి తల్లిదండ్రులు రామిరెడ్డి, వందన ఆనందం వ్యక్తం చేశారు.

కమిషనర్ దృష్టికి పట్టణ సమస్యలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్యను జమ్మలమడుగు జనసేన కో-ఆర్డినేటర్ దేరంగుల జగదీష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల ప్రధాన రహదారుల వెంబడి, పట్టణంలోని పలు వీధుల్లో వర్షపు నీరు నిల్వ ఉందని, వాటిని తొలగించాలని కోరారు. పట్టణంలో ఉన్న పలు సమస్యలను కమిషనర్‌కు వివరించారు. సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఒ గంగిరెడ్డి పాల్గొన్నారు.



బోల్తా పడిన సిమెంట్ ట్యాంకర్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్ఎంసి పరిశీలకులు

నూతన మెడికల్ ఆస్పత్రిలో తనిఖీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలో ఉన్న ప్రాంతీయ ఆస్పత్రిని నూతనంగా నిర్మించిన వైయస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాల్లోకి మార్చిన వైద్యశాలను ఎన్ఎంసి పరిశీలకుడు సుగుణ పరిశీలించారు. బుధవారం వైద్యశాలలోని భవనాలను పరిశీలించి, అక్కడ ఉన్న సౌకర్యాలు, రోగులకు అందుతున్న వైద్యులు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్ఞానేశ్వర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పిన సిమెంట్ ట్యాంకర్ బోల్తా

ప్రజాశక్తి - వల్లూరు

కడప-తాడిపత్రి జాతీయ రహదారి గోటూరు పెట్రోల్ బంకు వద్ద బుధవారం సిమెంటు ట్యాంకర్ అదుపు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ట్యాంకర్ పందిళ్లపల్లి నుంచి చెన్నై వెళుతుండగా బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదం చోటు చేసుకుందని డ్రైవర్ తెలిపాడు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ప్రజాశక్తి - రాజంపేట అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతమైన స్థానాల ను అధిరోహించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. మండలం లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసించి పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులకు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ప్రశంసా పత్రం, నగదు బహు మతితో పాటు జ్ఞాపికలు అందించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.ఆదిత్య, ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.జాస్మిన్‌లకు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా సేవా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు మట్టిలో మాణిక్యాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యతోపాటు క్రమశిక్షణ, సామాజిక విలువలు నేర్పిస్తారని తెలిపారు. త్వరలోనే మిగిలిన ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిం చనున్నట్లు పేర్కొన్నారు.

నీరు నిలిచి దెబ్బ తింటున్న వంతెన

ప్రజాశక్తి - చాపాడు



వంతెనపై నిలిచిన వర్షపునీరు

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి కుందూ నదిపై ఉన్న వంతెన వర్షపు నీరు నిలిచి దెబ్బతింటోంది. వంతెనపై వర్షపు నీరు తొలగి పోయేందుకు ఏర్పాటు చేసిన రంధ్రాలు వ్యర్థ పదార్థాలు, దుమ్ముతో నిండిపోవడంతో నీరు నిలుస్తోంది. వంతెనపై పర్యవేక్షణ కరువు కావడంతో నీరు ఏ మాత్రం తొలగిపోవడం లేదు. ఆదారిన వెళ్లే ద్వి చక్రవాహనదారులు, పాదచారులకు కూడా ఇబ్బందిగా ఉంది. భారీగా కురుస్తున్న వర్షాలకు వర్షపునీరు నిలుస్తున్నది. జిల్లాలో వర్షాలకు వంతెలను దెబ్బతింటున్నాయి. వంతెనపై రోడ్డుకు గుంతలు కూడా ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుందూ నది వంతెనపై వ్యర్థ పదార్థాలను తొలగించి వర్షపు నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



హోం మంత్రిని అభినందించిన బిటెక్ రవి, విజయ్

హోం మంత్రి అనితకు బిటెక్ రవి అభినందనలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను బుధవారం అమరావతిలోని సచివాలయంలో పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి), కడప జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులుగారి విజయ్‌కుమార్‌రెడ్డి, మరి కొందరు టిడిపి నాయకులు మర్యాదపూర్వంకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి అనిత కడప జిల్లాతోపాటు పులివెందుల నియోజకవర్గ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని మంత్రి పిలుపునిచ్చారు. గత అయిదేళ్లల్లో వైసిపి నాయకుల అరాచకాలపై ఆరా తీశారు. ఎవరైనా టిడిపి నాయకులను పోలీసులు ఇబ్బంది పెట్టారా.. వారి వివరాలను తనకు అందజేయాలని మంత్రి సూచించినట్లు తెలుస్తోంది.

చక్రాయపేట : రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రారెడ్డి (బిటెక్ రవి), మండల తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని శాంతిభద్రతలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.



పిఆర్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

రహదారుల వివరాలు వెంటనే నివేదించాలి

పిఆర్ అధికారులతో ఎమ్మెల్యే 'పుట్టా'

ప్రజాశక్తి - మైదుకూరు

గ్రామీణ ప్రాంతాల నుంచి, పట్టణాలను అనుసంధానించే రహదారుల ఏర్పాటు, దెబ్బతిన్న రోడ్లు, మరమ్మతుల వివరాలు, ఆధునీకరణపై పూర్తి వివరాలతో త్వరగా నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సూచించారు. మైదుకూరు నియోజకవర్గ సమగ్ర అభివద్ధిలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే ప్రొద్దుటూరులోని తన నివాసంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ, వార్డు మున్సిపాలిటీల్లో ప్రధాన సమస్యలపై ప్రత్యేకదృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు పంచాయతీరాజ్ సిబ్బంది ఎమ్మెల్యేను అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇఇ రామచంద్రారెడ్డి, డిఇ మల్లేశ్వర్‌రెడ్డి, ఎఇలు ఈశ్వరయ్య , మధు పాల్గొన్నారు.



వధువుకు నగదు అందిస్తున్న ముక్తియార్

నిరుపేద వధువుకు రూ.20 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక ముక్తియార్ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధికార పార్టీ కార్యనిర్వక కార్యదర్శి విఎస్ ముక్తియార్, మన ప్రజా సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి. అయూబ్ ఖాన్ చేతుల మీదుగా నిరుపేద వధువుకు రూ.20వేల నగదు, పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముక్తియార్ మాట్లాడుతూ గోకుల్‌నగర్ నివాసి మహమ్మద్ హుస్సేన్ కరోనా సమయంలో చనిపోయాడని, భర్తను కోల్పోయి కూతురి వివాహం చేయడం కష్టమైన తల్లికి ఆర్థికసాయం అందించడం చాలా సంతోషకర మన్నారు. పేద పిల్లలను ధన వంతులు ఆదుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో మన ప్రజా సేవాసమితి ఉపాధ్యక్షులు బీటెక్ బాషా, గౌరవ అధ్యక్షులు అరబ్‌సా, ట్రెజరర్ మొహమూద్, సహాయ కార్యదర్శి మహేష్, సభ్యులు రాజేష్, రాజేంద్ర, యూసుఫ్, మునయ్య, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ప్రమాదమా.. హత్యా అనే కోణంలో పోలీసుల విచారణ

ప్రజాశక్తి - చెన్నూరు

కడప-కర్నూలు జాతీయ రహదారి చెన్నూరు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బుధవారం తెల్లవారుజాము సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన భూమిరెడ్డి నారాయణరెడ్డి (38) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా నుజ్జునుజ్జు అయిందని తెలిపారు. నారాయణరెడ్డి బావ బాల గురుప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు.. అతడ్ని హత్య చేసి అక్కడ పడేశారా.. లేక ప్రమాదమా అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు,